కథ

# సమాంతరరేఖ

వడలి రాధాకృష్ణ




'చికెన్‌గున్యా అన్ని చోట్ల బాగా ప్రబలుతోందట. ఏదో వ్యాధి సోకిందని బొత్తిగా మొండికేస్తే ఒక్కోసారి ప్రాణాలకే ముప్పు తెస్తుందట! ఇంతకు ముందరే పేపర్లో చదివిన వార్త మననం చేసుకుంటున్నాడు వెంకటపతి.

ఒక్కసారి ఒళ్లు విరుచుకోబోయాడు. లోలోపల ఉన్న నీరసం బయటకు తన్నుకొచ్చింది. అలసత్వంతో అలాగే కూలబడ్డాడు. చేతులు వణుకుతున్నాయి. రెండు రోజుల నుండి పచ్చి మంచినీళ్లు కూడ ముట్టలేదు. దానితో చాల నీరసంగా ఉంది. మంచం ప్రక్క టీపాయ్ మీద ఉన్న ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీటి గ్లాసును అందుకోబోయాడు. వల్లకావడం లేదు. అయినా తప్పదు. టాబ్లెట్ వేసుకొని కనీసం గొంతైనా తడుపుకోక బోతే ఎలా ! తప్పని సరి పరిస్థితి మొత్తానికి ఓపిక కూడ గట్టుకొని గ్లాసును అందుకున్నాడు.

అదృష్టం కొద్దీ వచ్చింది చికెన్ గున్యా కాదు. మామూలు జ్వరం. టాబ్లెట్స్ ఉదయం, సాయంత్రం వేసుకోవడంతో రెండు రోజులలో బాగానే గట్టెక్కాడు.

అన్నీ ఉన్నా ఏమీ లేదనుకొనే తన ఒంటరి బ్రతుకు జ్ఞాపకం వచ్చింది. గుర్తుకు రాగానే నీరసం కమ్ముకొచ్చింది.

అలాగే నడుచుకుంటూ వచ్చి తలుపు తెరిచాడు.

ఎదురింటి తలుపులు వేసినవి వేసినట్లుగానే ఉన్నాయి.

లోపల మృధుల ఉందా లేదా ? ఒక్కక్షణం నిలబడి చూశాడు. చడీ చప్పుడు లేదు అక్కడ. నిస్సత్తువగా లోపలికి నడిచాడు.

నలిగిన నవ్వారు మంచం మీద బూరుగు దూది బొంత అటూ ఇటూ చెదరిపోయి అస్తవ్యస్తంగా ఉంది. తలక్రింద దిండు నేలమీద పడి ఉంది. పైన పాతకాలం నాటి కుండ టైపు ఫ్యాను తిరగలేక తిరుగుతోంది. అది చేసే శబ్దపు హింస నిజంగా తలనొప్పి తెప్పిస్తోంది. అక్కడ అంతా తన మానసిక స్థితి లాగే ఉంది.

నీరసంగా ప్రక్కమీదకు వాలి ఒత్తిగిల్లాడు. ఫ్యాను తనంతట ఆగి పోవడంతో అంతా నిశ్శబ్దం సంతరించుకొని ఉంది. మనసులో అశాంతి, ఓ భయానకమైన ఒంటరితనం కలగలసి అతలాకుతలం చేస్తోంది.

సైకిల్ బెల్ మ్రోగింది. ఉదయాన్నే పాలవాడు మ్రోగించే సైకిల్ శబ్దం. చీమ చిటుక్కుమంటే విన్పించే నిశ్శబ్దంలో పాలవాడి రాకను పడుకొనే గ్రహించాడు. గేటు తీసుకొని ఎదురింటి లోపలకి నడిచిన శబ్దం అరక్షణం తర్వాత ఇటుగా వస్తూన్న అలికిడి. మారు మాట్లాడకుండా అక్కడే ఉన్న గిన్నెలో పాలను ఒంపి ముందుకు కదిలాడు. నెమ్మదిగా లేచి పాలను చూసుకున్నాడు. నీటి శాతం బాగానే కన్పిస్తోంది. అవును పాలకన్నా నీరు దొరకడమే కష్టమవుతూన్న కాలం ఇది. సరిపెట్టుకోక తప్పలేదు వెంకటపతికి.

'మీ అమ్మకి ఈవేళ కూడ నలతగా ఉంది !' రాత్రి రాధిక మొగుడుతో

అన్నమాటలు గుర్తుకు వచ్చాయి వెంకటపతికి.

'నాకా వారంలో ఉండేది ఒక్కరోజు సెలవు. ఈరోజు వచ్చి ఎన్నని చూడగలను. అయినా డాక్టర్‌కి చూపించకపోయావా!' భార్యను ఉద్దేశించి అన్నాడు రాంబాబు.

'ఆవిడగారే ఒక డాక్టరు. మనం తీసుకెళ్లి చూపించేదేమిటి?' చిన్న నిష్ఠూరాన్ని జోడించి అంది రాధిక.

మాట్లాడలేదు రాంబాబు.

'అయినా వెళ్దాం వస్తారా అని అడిగాను. నాతో హాస్పిటల్‌కి రావడం మీ అమ్మకు ఇష్టం ఉండదనుకుంటా ! అయినా బలవంతం చేసే వయసు కాదాయె !'

ఎంత మగత నిద్రమత్తులో మూలుగుతున్నా వెంకటపతికి ఎదురింట్లోని రాధిక మాటలు విన్పించి ఆశ్చర్యపరిచాయి.

అందులోని నిజాలు అబద్ధాలను బేరీజు వేసుకోసాగాడు. రాధిక ఎంత సహజంగా అబద్ధమాడింది !

'మిమ్మల్ని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లకబోతే మీ కొడుకు నన్ను రాచి రంపాన పెడతాడు. మీ కిష్టం లేకపోయినా రావాలి ! అంటూ రాధిక మొక్కుబడిగా ముందర రోజు అన్న మాటలు గుర్తుకువచ్చాయి. వాటిల్లో అత్తగారి మీద అభిమానం కాని, ఆవిడ ఆరోగ్యం మీద ఆసక్తి గాని, జ్వరం తగ్గించాలన్న ప్రయత్నం గాని కనబడలేదు వెంకటపతికి.

ఏ కొంచెం ఆత్మ విశ్వాసం ఉన్న మనిషి అయినా మొక్కుబడి మాటలకి ఎంతవరకు స్పందిస్తారో అంతే స్పందించింది మృధుల.

'వద్దులే అమ్మా చిన్న చిన్న జ్వరాలు నాకు మామూలేగా ! ప్రతి దానికి పెద్ద డాక్టర్ దగ్గరకు ఏం పోతాం చెప్పు. మందులు వేసుకుంటాను. తగ్గకపోతే అప్పుడు వస్తాను' అంది మృధుల.

రాధిక గొంతు ఇంకేమీ విన్పించలేదు. మృధుల మాటలలో బ్రతుకు పట్ల నెలకొన్న నిస్సత్తువ తాలూకు ఛాయ స్పష్టంగా అగుపిస్తోంది.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం తాండవించింది.

'అత్తయ్యా ! మీరు డాక్టర్ దగ్గరకు రాకబోతె ఆయన్ని తట్టుకోలేను !'

'ఏమీ పరవాలేదులే అమ్మా' నేను సర్ది చెప్తాగా ! రాత్రి ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది.

"అమ్మకి నిజంగా ఇబ్బంది లేదనుకుంటా ! లేకుంటే ఇన్నిమార్లు బ్రతిమాలించుకుంటుందా !! పరిస్థితి విషమిస్తే అప్పుడు చూద్దాం" అనుకుంటూ మాటను మరో వైపుకు మళ్లించాడు రాంబాబు.

సమస్య ఉంటే దానికి పరిష్కారం. దాని పర్యవసానం ఏమిటి అన్న ప్రశ్నకు తనదైన సమాధానంతో రాజీ పడలేక తల్లి ఆరోగ్యం గురించి వచ్చిన అనుమానాన్ని గోయి తీసి కప్పేశాడు రాంబాబు.

ఎదుటి ఇంట్లోని సంభాషణ స్పష్టంగా విన్పిస్తుంది వెంకటపతికి. పగలు రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడూ నిశ్శబ్దంలో కాలం వెళ్లబుచ్చే ఆ ప్రాంతం మాటలు పొల్లు కూడ పోకుండా చక్కగా విన్పిస్తాయి.

గత ఇరవై సంవత్సరాలుగా ఆ చిన్న పెంకుటింటిలోని మార్పులు తాను గమనిస్తూనే ఉన్నాడు వెంకటపతి.

ఉద్యోగరీత్యా ఊరూరా తిరిగినా అమ్మ నాన్నల్ని చూడ్డానికి వచ్చిన ప్రతిసారి వాళ్లతో బాటు ఎదురింటి మీద కూడ ఓ క్షణం దృష్టిని కేంద్రీకరించే వాడు.

అలా ఆలోచించడంలో ఓ కృతజ్ఞత, ఏ విధంగా తీర్చుకోవాలో తెలియని ఋణానుబంధం ద్యోతక మయేవి. అవును మృధుల తనవారికి చేసిన సహాయం అటువంటిది. అటువంటి సేవలు ఈ రోజుల్లో ఎవరు చేయడానికి ముందుకొస్తారు. ఎక్కడో మృధుల లాంటి మంచి మనుషులు తప్ప.

ఉద్యోగం చేస్తూ ఊరూరా తిరిగిన తర్వాత శరీరానికి ఏభైఎనిమిది ఏళ్లు వచ్చినపుడు సర్కారు తనకు రిటైర్మెంటు ప్రకటించింది. అప్పటినుండి ఏకాకిగా మిగిలాడు వెంకటపతి.

కూతురు సుహాసినికి పెళ్లి చేసి ఓ అయ్య చేతిలో పెట్టి పంపాడు. ఎన్నాళ్ల నుండో తనను వెన్నంటి ఉన్న దయనోరా బ్లాక్ అండ్ వైట్ టెలివిజన్ తనలాగే సీనియర్ సిటిజన్‌గా మారి బొమ్మల్ని ప్రదర్శించలేనని మొరాయించినపుడు, తన కళ్ల ముందు జరిగే సంఘటనలు, మనుషుల మధ్య ఉండే కరుడు గట్టిన వైరుధ్యాలు వాటి వెనుక దాగి ఉన్న కఠోర వాస్తవాలు తనని ప్రభావితుణ్ణి చేసి ఆలోచనల్లో పడేస్తూ ఉంటాయి.

జీవితరంగం అంతా అర్థం కాని ఓ సంక్లిష్ట మైన నాటకంగా కన్పించినప్పుడు అందులో కన్పించే పాత్రలు, వాటి ఔన్నత్యాలు, పరకాయ ప్రవేశాలు, లౌక్యం పేరుతో సంకుచిత ధోరణులు, కుళ్లు కుత్సితాలు అన్నీ కలగలపి అభినివేశం ముసుగులో ఆవేశాన్ని రగిలించి ఓ చిత్ర విచిత్రమైన ధోరణిలోకి తీసుకెళతాయి. పాత్రలు తెరమీద ప్రత్యక్షమవుతూ....

అదృశ్యమై ఒక్కోసారి అంతర్ధానమవుతూ....

అవన్నీ వెంకటపతిలో ఆసక్తిని రగిలిస్తూనే ఉన్నాయి.


మధ్యలో పిరికితనం, కుటిలత్వం తాలూకు ఛాయలు తారసపడినపుడు ఆ పాత్రల అంతరంగాన్ని భేరీజు వేయలేక ఒక్కోసారి తాను తడబడేవాడు.

రాత్రి చీకటి, చీకటి ఆలోచనల్ని గుండెల నిండా నింపుకుంటూ ఉక్కిరి బిక్కిరవుతున్నా ఇంకా సేదదీరలేదంటోంది. అవడం పగటిపూట అయినా రాత్రి కునుకు లేమితో నిద్రపోవాలని ప్రయత్నిస్తు న్నాడు. కానీ వాస్తవం 'ససేమిరా' అంటోంది.

పగటిపూట సరి అయిన పని కాని, మరో రకమైన వ్యాయామం కాని లేకపోవడంతో వెంకటపతి శరీరం విశ్రాంతిని కోరడం లేదు. దానికి తోడు డెబ్భై ఏళ్లకు దగ్గరవుతున్న వృద్ధాప్యపు ఆలోచనల రొద ఈ మధ్య ఎక్కువై ఆయన్ని అతలాకుతలం చేస్తున్నాయి.

## కాల్షియం

ఎముకల నిర్మాణానికి, రక్తం తయారు కావడానికి, ఆఖరికి హృదయ స్పందనకూ చాలా ముఖ్యమైన సున్నం (కాల్షియం) మూలకం మనుషులు, ఇతర జంతు జాలానికే కాకుండా యావత్ విశ్వం మనుగడకే ప్రధానమైనదిగా శాస్త్రవేత్తలు గుర్తించారు. పాలపుంతలోని అసంఖ్యాక తారా మండలాల (గెలాక్సీల) తో సహా విశ్వం మొత్తం కాల్షియంతో పటిష్టంగా ఉందని, ఇదివరలో తలచినదానికన్న మరింత హెచ్చుగా (మరో 50 శాతం పైగా) ఈ మూలకం వ్యాపించి ఉందని 'స్పేస్ కామ్' అనే వెబ్‌సైట్ వెల్లడించింది.




ఇరవై ఏళ్ల క్రితం మృధుల ఆమె భర్త కొడుకుతో ఎదురింటిలోకి వచ్చింది. పరాయి ఆడదాన్ని పరిశీలనగా చూడటం సభ్యత కాదన్న సంస్కారాన్ని నరనరాల్లో సంపూర్ణంగా జీర్ణించుకున్న వెంకటపతి సభ్యత కాదని అనిపించినా మృధులను గమనిస్తూనే ఉండేవాడు.

స్వచ్ఛతకు మారుపేరైన తెల్లని చీరలో, కోలమొహం మీద దట్టమైన నల్లని ముంగురులతో..., సరిహద్దు రేఖలా మధ్యన తీసిన పాపిడితో.....

తళుక్కున మెరిసే ఎర్రటి రాయి వేసిన బేసరిని ముక్కుకు పెట్టుకొని... కనిపించీ కనిపించని చెవి రింగులతో....

లిప్తకాలం పాటు చూసిన ఆమె రూప లావణ్యం వెంకటపతిని మహిమాన్వితుణ్ణి చేసిందనే చెప్పొచ్చు.

సుతిమెత్తని మృధుభాషణం...గాలి తెరలతో సుకుమారంగా పోటీ పడే మెత్తని ధ్వని!... నిజానికి తాను చెవులు రిక్కించి వింటేనే గాని ఆమె మాటలు సొంతం వినిపించేవి గావు.

ఆమె భర్త ఒక ప్రైవేటు కంట్రాక్టరు దగ్గర గుమస్తా ఉద్యోగం. తాను ఓ చిన్న హాస్పటల్‌లో ఆయాగా పనిచేసేది. ఆసుపత్రికి టైము అయిందని వేగంగా నడుచుకుంటూ వెళుతున్నప్పుడు సెలవలకి ఇంటికి వచ్చిన వెంకటపతి చూడకనే చూశాడు.

ఆ కాస్త వ్యవధిలో ఆమె కొట్టొచ్చిన ప్రత్యేకత ఒకటి తనకు ఆనాడు గోచరించింది. సాంప్రదాయ బద్ధమైన ఆ వేషధారణ ఆనంద పరవశుణ్ణి చేసింది.

ఒకసారి తండ్రినుండి వచ్చిన కబురు వెంకటపతిని కంగారు పెట్టింది. తల్లికి పక్షవాతం వచ్చిందట. ఎక్కడో సిద్ధిపేటలో ఉన్నవాడు ఆగమేఘాల మీద వచ్చి పడ్డాడు. ఆవిడ పరిస్థితి చాల దీనంగా కనిపిస్తోంది. కాలు చేయితో సహా కుడిపార్శ్వం పూర్తిగా చచ్చుపడిపోయింది.

తల్లిదండ్రులిద్దర్నీ వెంట తీసుకుపోదామనుకున్నాడు. బొత్తిగా బ్రహ్మచారి జీవితం. ఎప్పుడూ క్యాంపులకు వెళ్లాల్సిన చోట ఈముసలాళ్లను సముదాయించగలడా?

ఈమెను తీసుకొని ఎక్కడికీ కదిలే పరిస్థితి లేదు. ఇక్కడే ఒక ఆయాను పెట్టి సపర్యలు చేయిస్తాను. తండ్రి మాటలు సహేతుకంగానే అన్పించాయి.

ఎవరో ఎందుకు మీ ఎదురింట్లో ఉన్న గుమస్తా భార్యతో మాట్లాడితే సరి. చాల నిజాయితీ వంతురాలు. అక్కడ ఇచ్చే జీతం మనమే ఇస్తే కంటికి రెప్పలా చూస్తుంది. ప్రక్క ఇల్లు కావడంతో ఎప్పుడూ కనిపెట్టుకుంటుంది' ఎవరో సలహా ఇచ్చారు.

సొమ్ములు ముఖ్యం కాదు. మంచం పట్టిన ఓ పెద్దామెకు సేవాభావంతో సపర్యలు చేయదల్చుకున్నాను.' అంటూ చేస్తూన్న నర్సు ఉద్యోగం మానేసి వెంకటపతి తల్లిని కంటికి రెప్పలా చూసుకోసాగింది.

తల్లి మరణం తరువాత వెంకటపతి ఓ రకమైన ఆత్మ న్యూనతా భావనను ఎదుర్కొన్నాడు. తాను పెళ్లి చేసుకున్న తర్వాత తండ్రిని పట్నం తీసుకెళ్లాలని ఎంతగానో ప్రయత్నించాడు.

'అలవాటయిన ఊరు, మనుషులు.... సాగినంతకాలం ఇలా సాగనీ !'

మారు మాట్లాడలేకపోయాడు.

ఒక్కరే ఈ ఊర్లో ఏముంటారు చెప్పండి ! మీ కోడలు కూడ మిమ్మల్ని తీసుకురమ్మంది. మీరు వచ్చి మాతో ఉంటే మనవరాలుతో కాలక్షేపం చెయ్యొచ్చు !' సుహాసిని పుట్టిన తర్వాత అయినా వస్తాడన్న నమ్మకంతో అడిగాడు వెంకటపతి.

'ప్రస్తుతానికి అన్నీ సవ్యంగానే సాగుతున్నాయి. నేను రావాలనుకున్నప్పుడు తప్పక వస్తాను' రెండోసారి కూడ నిరాశే ఎదురయింది. వెంకటపతి తల్లి కాలంచేసిన తర్వాత సంవత్సర కాలం బాగానే సాగింది.

తర్వాత చరిత్ర పునరావృతమయింది.

'మంచాన పడ్డముసలాయన్ని ఇక్కడికెలా తెచ్చేది ! పట్నంలో అసలే ఇరుకుకొంప. మీరు ఇంటిపట్టున ఉండరాయె !! ఈ పసిపిల్లలతో నేను చేసుకోలేను బాబు' భార్య కరాఖండీగా చెప్పే సరికి మనస్సులో నొచ్చుకున్నాడు వెంకటపతి.

ఏదో చెప్పబోయాడు.

'మీరెన్ని చెప్పినా నా వల్ల కాదు బాబూ' మీ అమ్మకు చేసిన మృధుల ఉందిగా. నెలకు ఓ రెండు వేలు పడేస్తే సరి. అన్నీ ఆమె చూస్తుంది. తన వృత్తి అదేగా !!

భార్య కఠినంగా అన్న మాటల్లోని వాస్తవాన్ని గ్రహించకపోలేదు. ఒక తెలియని ఆశక్తత ఆవహించింది వెంకటపతిని. ఆమె చెప్పినట్లు చేయక తప్పలేదు.

'ఆరోజు మా అమ్మ ! ఇప్పుడు నాన్న... మీరే కలుగజేసుకోక పోతే వారి పరిస్థితి ఎలా ఉండేదో !! తండ్రి చనిపోయిన తర్వాత మృధులను ఉద్దేశించి అన్నాడు.

"నేను కాకపోతే లోకం గొడ్డు పోయిందా ! మరొకళ్లు వస్తారు. అయినా చేసినందుకు నెలనెలా ఇంతని ఇస్తూనే ఉన్నారుగా !

'ఏమిస్తే మటుకు మీ ఋణం తీర్చుకోగలం చెప్పండి' ఓ పదివేల రూపాయలు మృధుల చేతిలో బెట్టబోయాడు.

కట్టుకున్నవాడు కాదని ఎక్కడికో వెళ్లిపోయాడు. మిగిలింది నేను, నా రక్తం పంచుకొని పుట్టిన కొడుకు ! వీడిని ఆ మాత్రం పెంచుకోలేక పోతానా !! మీ దగ్గర ఎక్కువ డబ్బు తీసుకోవడానికి నా ఆత్మాభిమానం ఒప్పుకోదు.

ఆ క్షణంలో మృధుల ఓ అపురూపమైన వస్తువుగా అన్పించింది. విధి ఎంత విచిత్రమైంది. భార్య పిల్లలతో ఆనందంగా కాలం వెళ్ళ బుచ్చుతూన్న వెంకటపతిని క్రూరంగా వెక్కిరించింది. అందునా కొన్ని నెలల్లో రిటైర్ కాబోతూన్న సమయంలో భార్య గుండెనొప్పితో మరణించింది. ఆమె హఠాన్మరణం వెంకటపతిని నిలువునా క్రుంగదీసింది. భవిష్యత్తు అంతా అంధకారంగా తోస్తోంది.

✿ ✿ ✿

రోజులు దొర్లుకుంటూ ఐదేళ్లు గడిచాయి. ఆ ఐదేళ్లలో తన శరీరంలో మార్పులు చాల వచ్చేశాయి. వ్యాహాళికి వెళ్లడానికి శరీరం ఇష్టపడటం లేదు. ధైర్యంచేసి తిరగటానికి వెళితే తిరిగి వచ్చాక కాళ్లనొప్పులు.... రాత్రిళ్లు నిద్రపోనిచ్చేవి కావు.

ఈ ఐదేళ్లలో ఎదురింటిలోని మృధులను అరనిమిషం పాటు అప్పుడప్పుడు చూడటం తప్ప ఆమెతో పరిచయం అవలేదు.

ఆమె మాటలు, లిప్తపాటు లీలగా కనిపించే ఆమె శరీరాకృతి తప్ప మృధుల గురించి తెలియడం గాని, అవసరం కానీ కలగలేదు. ఆమె గురించి తనేమీ ప్రత్యేకంగా ఆలోచించినట్లు కూడ జ్ఞాపకం రావడం లేదు. ఐనప్పటికీ ఋతు మార్పిడిలో ప్రకృతి వ్యత్యాసాల మాదిరిగా తనలోని భావ వైరుధ్యాలు అన్నీ కలగలిసి ఆమె పట్ల ఓ కృతజ్ఞతా భావనను కలగజేసినాయని చెప్పొచ్చు.

తన కన్నా బహుశా పదేళ్లు చిన్నదయిన మృధుల బ్రతుకు నీరెండలో కాలం వెళ్లబుచ్చుతూనే ఉంది.

సుహాసినికి పెళ్లిచేసి అత్తవారింటికి పంపించిన తరువాత పిత్రార్జితం తాలూకు కొద్దిపాటి ఆస్తిని తెగనమ్మి బ్యాంక్‌లో జమ చేశాడు. దానిమీద వచ్చే వడ్డీతోను, తనకు వచ్చే కొద్దిపాటి పించనుతోను రోజులు దొర్లించసాగాడు.

ఊరికి దూరంగా ఉన్న తాతల నాటి సొంత కొంప. క్రింది పోర్షన్ అద్దెకు ఇద్దామని ప్రయత్నం చేశాడు. కానీ అక్కడ దొంగల భయం ఎక్కువ అన్న పుకార్లతో ఎవరూ అద్దెకు రావడానికి సాహసించ లేదు. వాళ్లను ఇబ్బంది పెట్ట డం ఎందుకని తాను అలా వదిలేశాడు.

రాంబాబు సుహాసిని ఒకే ఈడు వారు కావడంతో అప్పుడప్పుడు కలుసు కోవడంతో వారిద్దరి మధ్య స్నేహం పెరి గింది. కానీ మృధుల ఇంటికి వెళ్లడం గాని, మృధుల వెంకటపతి ఉన్న మేడ మీదకు రావడం గాని ఎప్పుడూ జరుగలేదు.

తన ఉనికి మృధులకు తెలిసి ఉండాలి. ఆమె వ్యక్తిత్వం గురించి వెంకట పతికి చాలవరకు తెలుసు.

యాధృచ్ఛికంగావినబడే మాటలు బట్టి మృధుల ఇష్టాయిష్టాలు, కుటుంబ ఆర్థిక పరిస్థితి తనకు అవగాహన అయ్యేది. అసలు ఆర్థికంగా ఇతరుల మీద ఆధారపడి జీవితాన్ని వెళ్లదీయడం చాలా కష్టమైన పని.

బ్యాంకులో ఉంచిన పైకం మీద వడ్డీ తరుగుతున్నా, క్లుప్తంగా తను బ్రతకబట్టి రోజులు బాగానే వెళుతున్నాయి. సుహాసిని అల్లుడు చంద్రం అన్యోన్యంగా కనిపించేవారు. పెళ్లయిన చాలా కాలం వరకు అల్లుడికి డబ్బుమీద ఆశ లేదను కునేవాడు తాను. కానీ ఒకసారి పుట్టింటికి వచ్చిన సుహాసిని వెంకటపతి ఆర్థిక స్థితి గురించి, బ్యాంక్ బ్యాలన్స్ గురించి ఎత్తింది. తమకు ఏమైనా సర్దమన్న ధోరణి కన్పిం చింది ఆమె మాటల్లో.

మీ అల్లుడుగారు వ్యాపారంలో పెట్టుబడి కోసం అడగమన్నారు. ఇప్పటి రూపాయి పెట్టుబడి సంవత్సరకాలంలో పదిరూపాయలు అవుతుందని చెప్ప మన్నారు. ఈ ఇల్లు అమ్మేసి నువ్వు కూడ వచ్చి మాతో ఉంటే బాగుంటుందన్నారు.

వెంకటపతి మౌనమే సమాధాన మయింది.

కన్నందుకు కూతురిని పెంచి పెద్ద చేశాడు. చదువు చెప్పించాడు. అన్నీ ఉన్న అయ్యకిచ్చి పెళ్లి చేశాడు. తన తాహతుకు తగ్గట్టు అచ్చటా ముచ్చటా అన్నీ బాగానే చూశాడు. కానీ వాళ్లకి ఇంకా ఏదో రాబట్టుకోవాలన్న ఆశ !

ఆ ఆలోచన సుహాసినిదా... అల్లుడు చంద్రానిదా...లేక ఇద్దరిదీనా !!

తండ్రి మౌనముద్ర రుచించలేదు సుహాసినికి.

'రెండు రోజులు ఉండివెళ్లమ్మా!'

'లేదు పిల్లలకు ట్యూషన్లు! ఈ రోజే వెళ్ళాలి!!'

కాదనలేకపోయాడు వెంకటపతి.

'నా గురించి నీకు అంతా తెలుసు. స్వతంత్రంగా బ్రతికినవాడిని. ఊరికి దూరంగా ఇక్కడ ఉన్న కాస్త ప్రశాంతత పట్నంలో ఉండదు.

'నాకూ వయసు మీరిపోతోంది నా సర్వం మీకు అప్పగించి త్వరలో మీ దగ్గరికి వచ్చేస్తానేమో!'

సుహాసిని మరిక రెట్టించకుండా వెళ్లి పోయింది.

'ఏమిటి అత్తయ్యా ! ఒంట్లో బాగా లేనప్పుడు పడుకునుండాలి గాని.... కాఫీ నేను తయారుచేసి ఇచ్చేదాన్ని కదా !!' ఎదురింట్లోని రాధిక మాటలు వెంకట పతిని మేల్కొలిపెయి.

'నువ్వు గాఢంగా నిద్రపోతుంటే లేపడం ఇష్టంలేక'

భర్త మెప్పుకోసం రాధిక అప్పు డప్పుడు అలా నటిస్తుందని వెంకటపతికి తెలియంది కాదు. ఒక్క కాఫీ విషయ మేమిటీ అన్నింటిలోనూ అంతే !'

'పేపర్' అంటూ పేపరుకుర్రాడు వచ్చి అరవడంతో గుమ్మం వరకు మెల్లిగా నడచి వచ్చాడు వెంకటపతి. పేపరు అందుకుంటూంటే ఎదురు ఇంట్లో దండేనికి చీర ఆరవేస్తూన్న మృధుల కన్పించింది.

నీలిమేఘం రంగు చీరాల చీర మీద పసుపు రంగు చుక్కలు ఒకదానిమీద ఒకటి పోటీపడి మెరుస్తున్నాయి. ఉద యాన్నే ప్రాతః కాంతలా ఉంది. చెదిరిన జుట్టు వీస్తూన్న చిరుగాలికి శృతి కలుపుతూ చిన్నగా ఎగురుతోంది.

'ఆమె మంచి మనిషి !' అను కునేంతలో ఐకెట్‌తో మాయమయింది.

# సత్యాగ్రహం

**అ**ప్పుడప్పుడే అయినా ఆ రూపం నాకెదురు పడినపుడల్లా
నాలో ఒక అపరాధ భావాన్ని పెంచుతుంది
నాకెందుకులే అని వూరుకోనివ్వదు
అంతకు ముందున్నట్లుగా నన్నుండనివ్వదు
తిరునాళ్లలా జనం పోగైన చోట గానీ
హోటళ్ల ముందరా ఫుట్‌పాత్‌లపైనగానీ కన్పిస్తూనే వుంటుంది
ఎండకి ఎండిపోతూ వంటికి రాసుకున్న తగరం రంగు కరిగి
శరీరం ఉడికిపోతూ
కదలక మెదలక నిలబడిపోయిన ఆ పదేళ్ల పసిదేహం
ఎవరి వెంటాపడి చేయిచాపదు... ఏ బాధనీ చెప్పుకొని విసిగించదు
అటూ ఇటూ తలైనా తిప్పి చూడదు
కంటిరెప్పల నల్లాడిస్తూ నిశ్శబ్దాన్నీ నిశ్చలత్వాన్నీ
మనసుకు నేర్పుతున్నట్లుంటుంది
ఆ రూపాన్ని దాటుకు వెళ్తున్నపుడల్లా ఒక అవస్థ
కళ్ళకి కలతవుతుంది. మనసుమీద వాలి
కందిరీగై కుడుతుంది.
ఆ రూపం పేరు ఒక దేశమంత దేశదేశాల్నీ కదిలించినంత
కమ్మటి బ్రతుకు లేక
కడుపు నిండీ నిండక
శివుడల్లే మూరెడు గుడ్డ కట్టుకుని
నాలుగురోడ్ల కూడలిలో శిలా విగ్రహంలా నిలబడిన ఆ రూపాన్ని
ఒక మాట అడగాలనిపిస్తుంది
నువ్వు ఎన్ని కోట్ల ప్రశ్నలకు జవాబువి గాంధీ
నిన్నెవరు తయారు చేశారిలా అని –
ఆ చిన్న గాంధీ గారికి నోటివెంట మాటలు రావు శబ్దమే తప్ప.

**– ఆదూరి సత్యవతీదేవి**

పేపరు చదువుదామని పేజీలు తిరగేశాడు. అక్షరాలు అల్లిబిల్లిగా అగుపిస్తున్నాయి. తనలోని ఈ మార్పును గత కొన్ని నెలలుగా గమనిస్తూనే ఉన్నాడు.

పెరుగుతూన్న వయసు చూపును తెంచి పారేస్తోంది. ఇన్నాళ్ళూ ఏదో కళ్ళజోడు పెట్టుకొని కాలక్షేపం చేసినా ఇప్పుడు కంటి గ్లాసుల మందం పెంచాల్సిన అవసరం ఏర్పడింది.

అరవై ఎనిమిది ఏళ్లు !.... జీవితంలో ఏమీ సాధించకుండా సాగిన అరవైఎనిమిది సంవత్సరాలు.... పూర్తిగా ఖాళీగా ఓ విధమైన నిర్లిప్తత మిగిల్చి వెళ్లిన అరవైఎనిమిది ఏళ్లు.....

చిన్న చదువు, సాధారణ ఉద్యోగం పుణ్యమా అంటూ జీవితం యాంత్రికమై ప్రత్యేకమైన ఆసక్తి అంటూ ఏమీ కలగలేదు. పెద్ద కోరికలూ ఉద్భవించలేదు. చిన్న ఊరిలో పెరగడం వల్ల లోకజ్ఞానం కూడ అంతంత మాత్రం.

యాంత్రికంగా వెళుతూన్న జీవితం, సంకుచిత ధోరణుల ఈర్ష్య అసూయల మధ్య విజ్ఞత లుప్తమై వివేకం ఆవిరైన మనుషుల నడుమ సాగిన రోజులు....

చాలా మంది బ్రతుకుతీరు అంతే అయినా తనది మరీను. నరసాపురంలో డిగ్రీ పూర్తి చేశాడు. ఎవరితోను స్నేహం అవలేదు. ఎవరికీ దగ్గరవలేదు. ఇంటిలో అప్యాయతకి కొదవలేకపోయినా, ఏమిటో గతంలోనికి తరచి చూస్తే ఏ సంఘటనా ప్రత్యేకంగా జ్ఞాపకానికి రావడం లేదు.

కొన్నేళ్ళ వైవాహిక జీవితం.... ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తండ్రి అవతారం.... భార్య హఠాన్మరణం.... అప్పటి నుండి మానసికంగా ఒంటరితనం.... ఆలోచిస్తూ పేపరు చదువ ప్రయత్నించాడు. కానీ వల్ల కావడం లేదు.

'మృధులమ్మ గారికి జ్వరం తగ్గలేదు. మాత్రలు నిండుకున్నాయి. నన్ను వెళ్లి తెమ్మంటున్నారు. మీ దగ్గరేమయినా దొరుకుతాయోమోనని' పని అమ్మాయి ఒకింత కంగారుగా వచ్చి అడిగింది.

'ఉన్నవి ఇవి ! జ్వరం ఎక్కువగా ఉందా !!'

'ఈ మధ్య ఆవిడ చాలా నీరసంగా ఉంటున్నారు.'

'మృధుల ఆరోగ్య పరిస్థితి వెంకటపతికి అంతగా తెలీదు. కానీ రాత్రిళ్లు విన్పించే ఫెళ్లు ఫెళ్లు దగ్గు తనను ఆలోచింపజేస్తూనే ఉంటుంది.

రాత్రిళ్లు ఆమె పొడి దగ్గు విన్నప్పుడల్లా 'డాక్టరు దగ్గరికి వెళ్లి చూపించుకోండి' అనాలనుకుంటాడు. చెప్పలేక కాదు కాని చెబితే ఏమనుకుంటుందో నని వెనుకంజ వేసేడు.

'అమ్మగారు కళ్ళు తిరిగి పడిపోనారు. ఒక్కసారి వస్తారా !' అంటూ వచ్చింది పనిమనిషి. లేని ఓపిక తెచ్చుకొని ఎదురింటి వైపు నడిచాడు వెంకటపతి.

మంచానికి బల్లిలా అతుక్కొని ఉంది. కళ్లు తెరచి మాట్లాడే శక్తి లేక మూలుగుతోంది. నుదుట చెయ్యి వేశాడు. జ్వరం బాగా ఉన్నట్లుగా ఉంది.

'డాక్టర్ని వెంటబెట్టుకొని వచ్చేసరికి విపరీతంగా ఆయాసపడుతోంది మృధుల.'

'ఈమె చాలా వీక్‌గా ఉంది. అన్ని టెస్ట్‌లు చేస్తేనే గాని ఏమీ చెప్పలేను. ముందు బలానికి మందులు రాసిస్తాను. భయం ఏమీ లేదు.' అంటూ టాబ్లెట్స్ వ్రాసి వెళ్లిపోయాడు.

'అనవసరంగా మీకు ఇబ్బంది కలిగింది' టాబ్లెట్స్ తెచ్చిన తనను చూసి అంటూన్న మృధులకు ఏం చెప్పాలో తెలియడం లేదు వెంకటపతికి.

'దానిదేముంది మనిషికి మనిషి సాయం కష్టాలలో ఉన్నప్పుడే కదా ! మీరు మాకు ఎంత సాయం చేయలేదు చెప్పండి!!'

'అవన్నీ ఇప్పుడెందుకు. నేను కోలుకుంటున్నాను' అంటూ దాటవేయబోయింది మృధుల.

వెంకటపతి చెప్పినట్లుగా పళ్లరసం, టానిక్‌లు, మందులు వాడిన పదిహేను రోజుల తర్వాత గాని మృధుల ముఖంలో పూర్తి కళ రాలేదు.

'నా రోగం పుణ్యమా అంటూ మీ జేబుకు చిల్లి పడింది. ఎంత ఖర్చు పెట్టారో చెబితే ఆ డబ్బు ఇవ్వగలను. దయచేసి చెప్పండి'.

'దానిదేముంది లెండి'

'ఎంత ఖర్చు పెట్టారో చెప్పకబోతే నా మీద ఒట్టే !'

'సుమారు ఏడొందల రూపాయలు ఖర్చు పెట్టానని చెప్పక తప్పలేదు వెంకటపతికి.'

'ఇవిగో రెండు వందలు. మిగతావి నాలుగు రోజుల్లో తీర్చేస్తాను' అంటూన్న మృధుల ముఖంలో ఒక రకమైన సంతృప్తిని గమనించాడు వెంకటపతి.

మృధుల మామూలు మనిషి కావడానికి చాలా వారాలు పట్టింది. ఈ మధ్యలో ఒకటి రెండుసార్లు రాంబాబు, భార్య వచ్చి చూసిపోయారు.

'తనతో రమ్మని రాంబాబు మిమ్మల్ని అడగడం రెండుమూడుసార్లు విన్నాను. వాళ్లతో వెళ్ళి ఉంటే బాగుండేదేమో !'

ఒక్కక్షణం ఆమెనుండి మౌనమే సమాధానమయింది. తర్వాత నెమ్మదిగా నోరు విప్పింది.

'రాంబాబు దగ్గరకు వెళ్లి ఉండడం నాకు ఆనందమే. అనివార్యం కూడాను. కానీ అక్కడకు వెళ్లాక విశ్రాంతి దొరకదు. కోడలుతల్లిదండ్రులు వాళ్ల దగ్గరే ఉంటారు. వాళ్లు కూడా పెద్ద ఆరోగ్యవంతులు కారు. రాధిక గురించి నాకు తెలియంది కాదు. అక్కడకు వెళితే ఇంటి పనంతా నా మీదే పడుతోంది.

'ఆ బరువు మోయాలని ఉన్నా, మోయగల్గిన సత్తా లేక.... ' కళ్లు మూసుకుంది మృధుల.

'ఇక్కడ సహాయం మీకు అవసరమైతే ఎవరు చేస్తారు !'

'ఇప్పుడు ఏం జరిగిందీ ? మీరు వచ్చి సహాయం చేయలేదా ?? మీరు నిజంగా నన్ను రాంబాబు దగ్గరకి వెళ్లమంటారా???' తన శుష్కించిన కళ్ళతో పరీక్షగా వెంకటపతివైపు చూస్తూ అంది.

'మానవజీవితాలు నీటి బుడగ వంటివి అంటారు. అవి ఎప్పుడు పగులుతాయో చెప్పలేం !

## జీవన ప్రమాణాలను పెంచేందుకు

ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ తనకు సలహాలివ్వడానికి నోబెల్ పురస్కార గ్రహీత, ప్రఖ్యాత ఆర్థిక వేత్త అమర్త్యసేన్‌ను నియమించుకున్నారు. ఇదే అంశంపై నిపుణలతో కూడిన బృందానికి నేతృత్వం వహించడానికి మరో నోబెల్ బహుమతి గ్రహీత, అమెరికా ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిట్జ్‌ను నియమించారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు ఫ్రాన్స్‌లో అభివృద్ధిని అంచనా వేయాలనే అంశంపై అమర్త్యసేన్ ఆ దేశాధ్యక్షుడికి సలహాలిస్తారు. సర్కోజీ గత మేలో ఫ్రాన్స్ దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

సహాయం చేద్దామని ఉన్నా కాలం అనుకూలించక పోవచ్చు. మీ కంటూ ఉన్న వ్యక్తుల దగ్గరికి వెళ్తే మీకు అవసరమైనంత కాలం ఆధారం ఉంటుందేమో ఆలోచించండి మరోసారి' అన్నాడు.

'గతంలో నా గురించి నేను పట్టించుకోలేదు. ఈ మధ్య వచ్చిన జబ్బు నయం అయాక ఎందుకో జీవించాలన్న కోరిక ఉద్భవిస్తోంది. ముందుముందుకాలం నన్ను ఎలాంటి మెలికలు తిప్పుతుందో చూద్దాం అంటూ సంభాషణ ఆపింది మృధుల.

మళ్ళీ ఆవిషయం ఎప్పుడూ ప్రస్తావించలేదు వేంకటపతి. కొంత కాలం గడిచింది.

'మీరు పేపరు చదవడం పూర్తయితే మృధులమ్మ పేపరు అడిగి తెమ్మన్నారు.

యథా ప్రకారం పేపరందిచ్చాడు వెంకట పతి. పది నిమిషాలు గడిచాయి.

'ఏమిటి ఈవేళ పేపరు చదవకుండా ఇచ్చేశారు' మడత విప్పని కాగితాలను చూస్తూ అంది మృధుల. అటు తిరిగాడు వెంకటపతి.

చేతిలో కాఫీ గ్లాసుతో నిలబడి ఉంది.

అలా ఆమె డాబా మీదకు రావడం చూసి చాలాకాలం తర్వాత అదే మొదటిసారి. నోట మాట రాలేదు వెంకటపతికి.

ఇంకా పూర్తిగా తెల్లారినట్లు మబ్బుల మాటు సూర్యకిరణాలు బయటకు చొచ్చుకు రావడానికి ఆపసోపాలు పడుతున్నాయి. మృధుల రాకతో అజ్ఞానాన్ని త్వరగా చీల్చుకొని వెలుగురేఖల్ని సంధిస్తున్నట్లు అన్పిస్తున్నాయి. లేత బిస్కెట్ కలర్ చీరలో ఆమె నిండుగా కన్పిస్తోంది. ఆ మెరిసే పాదాలను పట్టి ఉన్న పట్టీల సవ్వడి వింతగా ఉంది.

'లోపలికి రమ్మనొచ్చుగా !' అంది నవ్వుతూ.

కళ్లతోబాటు ఆయన నోటి మాట కూడ మసకగా ఉంది.

'మాట్లాడరే ! లోపలికి రావచ్చునా !!'

'నే చెప్పేలోగా మీరే ప్రవేశించారుగా... నవ్వుతూ అన్నాడు ఆమె ఇచ్చిన కాఫీ గ్లాసు నందు కుంటూ.....

ఈరోజు మీరు పేపరు చదవలేదని అర్థమయింది విషయం తెల్సుకుందామని వచ్చాను.

ఒకింత సిగ్గు పడ్డాడు వెంకటపతి.

'ఈ మధ్య కాలంలో పేపరు చదవడం కష్టమవుతోంది. అక్షరాలు ఆనడం లేదు. కేటరాక్ట్ కాబోలు. ఈ వయస్సులో ఇది సామాన్యమే !'

'మీరు కాఫీ త్రాగుతూ ఉండండి. పేపరు నేను చదివి వినిపిస్తాను' అంటూ పేపరు చదవడం మొదలు పెట్టింది. శ్రావ్యమైన కంఠంతో స్వచ్ఛమైన ఉచ్చారణతో మృధుల పేపరులోని వార్తలు చదివి వినిపిస్తూంటే వెంకటపతి మనస్సు ఆనందంతో

## ప్రపంచంలోనే ఎత్తైన వంతెన

జమ్మూకాశ్మీర్‌లోని చీనాబ్ నదిపై నిర్మిస్తున్న రైలు వంతెన ప్రపంచంలోనే ఎత్తయిన వంతెనగా రికార్డుకు ఎక్కనుంది. అత్యంత కష్టతరమైన భౌగోళిక పరిస్థితుల్లో ఈ వంతెన నిర్మాణం జరుగుతోంది. ఇది 2011 నాటికి పూర్తికాగలదని అంచనా. నదీమట్టం నుంచి 359 మీటర్ల ఎత్తున ఈ వంతెన నిర్మిస్తున్నారు. దీని నిర్మాణానికి 25 వేల టన్నుల స్టీలు అవసరమవుతుంది. ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత ఎత్తున నిర్మించిన వంతెనగా దక్షిణ ఫ్రాన్స్‌లోని Millau Viaduct బ్రిడ్జి రికార్డై ఉంది. దీని ఎత్తు 280 మీటర్లు.

గంతులు వేసింది.

'ఏదో ఆలోచనలో పడ్డారు. నే వెళ్లి కాస్త ఉడకేసుకోవాలి' అంటూ కాఫీ గ్లాసుతో లేవబోయింది.

'ఈ కడుపు బాధ లేకపోతే ఈ లోకం ఎంత భిన్నంగా ఉండేదో ! అరగంట ఆలస్యంగా స్టౌ వెలిగిస్తే వచ్చే నష్టమేమీ లేదు !

అప్పటివరకు ఎండవేడిమికి ఆవిరిగా మారి ఒక్క చిరుగాలి పులకింతకు చినుకుగా మారిన కురిసే మేఘంలా ఉంది మృధుల తీరు.

పగలబడి నవ్వసాగింది. తెరలు తెరలుగా నవ్వుతోంది. పైట చెంగుతో ఆపుకోడానికి ప్రయత్నిస్తోంది. కానీ ఆమె వల్ల కావడం లేదు.

తరతరాలుగా నిర్మించుకున్న నిశ్శబ్ద ప్రపంచాన్నీ చీల్చుకొని పరుగున వచ్చి ఓ అభినివేశంతో... అంతర్లీనమైన సహృదయ తరంగాల మధ్య ఆపన్న హస్తంతో విరాజిమ్ముతున్న సుగంధ పరిమళంగా తోస్తోంది ఆవిడ వ్యక్తిత్వం.

ప్రతిరోజు ఉదయం మృధుల కాఫీతో వచ్చి కూర్చొని పేపరు చదివి వినిపించడం మామూలయింది.

మధురమైన కాఫీని ఇష్టపడే వెంకటపతికి ఉదయం మృధుల కోసం ఎదురు చూడడం ఒక కొత్త అనుభూతి.

అది తనదినచర్యలో భాగమయింది.

'ఎన్నాళ్ళమ్మా ! మీ యింటికి వచ్చి లేదని పించుకుంటూ వెళ్లడం. ఇది పదోసారి. ఇవ్వాల్సింది నాలుగువేలు దాటింది ఇన్నిసార్లు అడిగించుకోవడం ఏమీ బాగాలేదు' ఓ మగకంఠం వినిపిస్తోంది.

'మా అబ్బాయి వస్తాడు. రాగానే మీ బాకీ తీర్చేస్తాను' ప్రాధేయ పడుతోంది మృధుల.

ఏ ఆధారం లేని ఆమెకు డబ్బు ఇబ్బంది ఉండొచ్చు అని అనిపించి నా పరిస్థితి ఇంత విషమంగా ఉంటుందని ఊహించలేదు వెంకటపతి. కొడుకు ఉద్యోగం చేస్తున్నాడు. కానీ అతను ఆదుకుంటాడన్న నమ్మకం లేదు.

అప్పటికప్పుడు వెళ్లి తనకున్నంతలో ఆమెను ఆదుకోవాలనిపించింది. ఏదైనా సహాయం కావాలేమో.... అంత రాత్రి పూట వెళ్లడం సభ్యతగా అన్పించక అటూ ఇటూ అసహనంగా కదిలాడు.

రాత్రి తెల్లవార్లూ ఫెళ్ళు ఫెళ్ళున దగ్గు విన్పిస్తూనే ఉంది.

'ఏమిటీ రాత్రి అంతా ఇంట్లో లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. నిద్రపోలేదా ఏంటి' కాఫీగ్లాసుతో వచ్చి కూర్చొంది మృధుల.

'...........'

'సారీ ! నా అనారోగ్యం మీ విశ్రాంతికి భంగం కల్గించినందుకు'

'ఏదైనా సహాయం అవసరమైతే తీసుకోవచ్చుగా ! ఆ షావుకారుతో అన్ని మాటలు అన్పించు కోవాలా !!'

తల వంచుకొంది.

'ఏదో అద్దెకోసం లెండి' రాంబాబు వచ్చేక తీర్చేస్తాను !'

'నమ్మమంటారా !'

మాట్లాడలేదు మృధుల

'మనిషికి మనిషి ఈ మాత్రం సహాయం చేయడంలో తప్పులేదనుకుంటాను. నా ఫించను నిన్ననే వచ్చింది. ఈ ఐదువేలు ఉంచండి. నాకు అవసరమైనప్పుడు అడుగుతాను' ట్రంకుపెట్టె అడుగునుండి ఏభై రూపాయల కట్ట బయటకు తీస్తూ అన్నాడు.

'క్షమించాలి ! మీ స్నేహాన్ని డబ్బుతో ముడి వేయడానికి ఇష్టపడను !!'

'అదిగాదు మృధులగారూ.... మంచాన పడ్డ ముసలాళ్ళకి ఎంతసేవ చేశారు.... మీకు ఏమి

ఇచ్చినా తక్కువే !'

'పెద్దవాళ్లు ! నేను చేసిందేమీ లేదు. అయినా అప్పుడు నెలనెలా ముట్టజెబుతూనేఉండేవారు !'

'ఇదీ అదే అనుకొండి !'

'...................'

'అదే మృధులా.... డెబ్బైలో పడుతున్నాను. ఏ క్షణంలో ఎలా ఉంటానో.... ఈ దేహం, క్షణికమైన జీవితం.... ఈ వార్ధక్యపు చరమాంకంలో మీ వంటి మంచి మనుషుల ఆలంబన...'

చటుక్కున ఆయన నోటికి తన చేయి అడ్డు పెట్టబోయింది. అంతలోనే తమాయించుకొంది.

సుహాసిని తన దగ్గరకు రమ్మంటూనే ఉంటుంది. అల్లుడు కాదనడు. కానీ ఏమిటో నా వ్యక్తిత్వ స్వాతంత్ర్యం ససేమిరా అంటూంది. అయినా వారు మాటల్లో ఎప్పుడూ వ్యాపార ధోరణి కన్పిస్తూంటుంది. సాగినంతవరకు ఇలా మీలాంటి మనసున్న మనుషుల మధ్య....

మాట్లాడలేదు మృధుల. వింతగా ఆయన ముఖంలోకి చూసింది.

'జీవిత చరమాంకంలో చివరి అడుగులు వేస్తూన్నవాణ్ణి....

మరో మనిషి అవసరం కావల్సి వచ్చినప్పుడు మీరున్నారని ధైర్యం నాకు. అప్పుడు నేనుగా మీకేమీ ఇవ్వలేకపోవచ్చు.

కనీసం ఇప్పుడైనా కాదనకండి.

'.......................'

ఆ షావుకారు వచ్చి బలవంతాన మీ చేత ఇల్లు ఖాళీ చేయించి.... తర్వాత నాకు కనిపించకుండా దూరమై... ఆ దృశ్యాన్ని ఊహించుకోలేను. పదికాలాలపాటు పదిలంగా మీరుచల్లగా ఉండాలని.

ఏదో సాయం చేస్తున్నానని మాత్రం అనుకోవద్దు !'

'మనకి ఈ జీవితం మీద ఇంతమమకారం ఎందుకో అనినాకు అప్పుడప్పుడు అనిపిస్తూంటుంది. ఆశించడానికి ఏమీ లేకపోయినా, సాధించవలసింది ఏమీ కనిపించకపోయినా, చిన్న నలత చేస్తే భయపడి డాక్టరు దగ్గరకు పరుగులు పెడతాం !' నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అంది.

విచిత్రంగా చూశాడు వెంకటపతి.

మనకు తెలియకుండా ఏదో ఆశ మనసులో దాక్కొని ఉంటుందేమో ! అదే మనల్ని బ్రతికిస్తూ ఉంటుంది కాబోలు !! ఇలాంటి పిచ్చి ఆలోచనలు వేదనకే దారి తీస్తాయి. కానీ శాంతినివ్వవు....." చెప్పుకు పోతోంది.

టీపాయ్ మీద ఏభై రూపాయల కట్ట మృధుల వ్యక్తిత్వం ముందు వెలవెలబోతోంది.

'ఇక ఆపేసి పేపరు చదవండి మృధులా !'

తన శ్రావ్యమైన కంఠంతో పేపరు చదవడం మొదలుపెట్టింది.

✿ ✿ ✿

ఏమిటి మొహం వెలిగిపోతోంది. గవర్నమెంటు ఫించను ఏమైనా పెంచిందా ! కాఫీ గ్లాసుతో వచ్చి అంది మృధుల.

'లేదు ఇన్నాళ్ల నుండి మనసులో దాచుకున్న కోరిక నిన్న మీ ముందు వెళ్లగక్కినందుకు.

సూర్యరశ్మి మొహం మీద పడడంతో పండంటి ఆమె ముఖం వెలిగిపోతోంది. ఒక్కసారిగా నిండా నీళ్లతో వర్షింపబోతున్న మేఘంలా ఉన్న మృధులను చూస్తే వెంకటపతి గుండె ద్రవించింది.

'అవును.... రోజురోజుకీ నా ఆరోగ్యం క్షీణిస్తోంది మృధులా... ఇప్పుడు మీ ఆపన్న హస్తం కోసం అర్రులు చాచడం తప్పు కాదనుకుంటాను' అన్నాడు.

'ఈ లోకం ఎవరి గురించి లిప్తకాలం కూడ పట్టించుకోదు. జీవించాలన్న కోరిక ఉంటే మనం తీవ్రమైన కష్టాలని కూడ భరిస్తూబ్రతికి ఉంటాం. లేకపోతే భయం వలన చావకుండా బ్రతికి ఉంచుతోంది. ఎంతకాలం బ్రతికేం ? అన్నది ముఖ్యం కాదు. ఎలా బ్రతికాం, ఎందుకు బ్రతికేం అన్నదే నాకు ముఖ్యం....'

మీరు అన్నట్లు ఆరోజే వచ్చి నా సేవలు అవసరమైతే మనిషిగా నేనెప్పుడూ ముందుంటాను.

'.......................'

'నాకు మానసికంగా ఒక అభిమాని కావాలి. అది లభించినపుడు ఆ తోడును వదిలేయడం అవివేకం. తెలియని రేపు గురించి ఊహించుకొనే భయం గురించి ఈ రోజు నరకం చేసుకోవడం అర్థరహితం......

అది చెయ్యి ఇది అని వేధించకుండా ఉన్న ఒక తోడు కావాలి. నేను చెప్పే మాటలు విని పరిహసించకుండా నిండుగా నవ్వే వ్యక్తి కావాలి.

ఏళ్లు పైబడుతూంటే ఉదయం లేస్తే ఈ రోజు ఆనందంగా వెళ్తుందంటూ జీవితాన్ని వెళ్లదీసే ఆశావాది కావాలి. జీవితంలో ఒక వెలితి ఉందని అది పూడ్చే వ్యక్తి తటస్థ పడి అది పూడిస్తే కాని ఆ వెలితి మనకి ఉందని తెలియదు. అదే జీవితంలో ఒక విచిత్రం. నాకు ఆ తోడు దొరికింది. దానిని కనిపెట్టుకొనే ఉంటాను. దానిని వదులుకోవడం అవివేకం. ఉద్వేగపూరితమైన మృధుల మాటలు వెంకటపతిని ఆనందంతో ముంచెత్తాయి.

✿ ✿ ✿

రాత్రి అంతా మృధుల విపరీతంగా దగ్గుతోంది. ఎదురు డాబా మీద వెంకటపతికి నిద్ర పట్టడం లేదు. క్షణక్షణానికి అది ఎక్కువవుతోంది. పైకి ఎగదన్నే ఊపిరి అందక అవస్థ పడుతోంది. చటుక్కున అటుగా నడిచాడు. డాక్టరుని పిలిపించాడు.

'ఆమెకున్న క్షయరోగం బాగా ముదిరిపోయింది. మంచి ఆహారం, మందులు తీసుకునుంటే ఇంత తొందరగా ప్రాణం మీదకు వచ్చేది కాదు. ఇప్పుడేం చేయలేం !

కాళ్లు చేతులూ ఆడటం లేదు వెంకటపతికి.

దగ్గి దగ్గి అలసిపోతున్న మృధుల కళ్ళు కాంతి విహీనంగా ఉన్నాయి. ఏడ్చినట్లు కళ్లు ఉబ్బి ఉన్నాయి. ముక్కుపుటాలు అదురుతున్నాయి. చెవులు ఎర్రబడ్డాయి. ఏదో చెప్పాలని ప్రయత్నం చేస్తోంది. మాట బయటకు రావడం లేదు.

దూరంగా ఉన్న స్టూలును మంచానికి దగ్గరగా లాక్కున్నాడు. త్వరగా తెల్లవారి వెలుతురు వస్తే బాగుండుననిపించింది వెంకటపతికి.

✿ ✿ ✿

మృధుల చనిపోవడం.... కాటికి తీసుకుపోవడం అన్నీ క్షణాల మీద జరిగిపోయాయి. అవన్నీ నమ్మలేని కలలా అగుపిస్తున్నాయి వెంకటపతికి.

'నెలాఖరులోగా ఇల్లు ఖాళీ చేయకపోతే తర్వాత నెలకు కూడ అద్దె కట్టాలి ! అందుచేత నాలుగురోజుల్లో వచ్చి సామాన్లు తీసుకుపోతాను' ఉన్న కొద్దిపాటి సామాన్లని చివరి గదిలో కుప్పగా పోసి తాళం వేస్తూ అన్నాడు రాంబాబు.

మృధుల చనిపోయి అప్పుడే రెండు రోజులయింది. రాంబాబు వెళ్లిపోయాడు.

పేపరు కుర్రాడు తెచ్చిన పేపరు మడత నలగకుండా అలాగే ఉంది. పాలవాడు గిన్నెలో పోసిన పాలు అలాగే ఉన్నాయి.

లేచి కాఫీ కలుపుకోవాలని గాని, పేపరు చదువుకోవాలని గాని అన్పించలేదు వెంకటపతికి.

తనకు ఆలంబనగా నిలుస్తుందనుకొనే మృధుల వెళ్లిపోయింది. తన ఆశల హరివిల్లుని అదృశ్యం చేసి తాను శాశ్వతంగా అదృశ్యమై పోయింది.

చుట్టూ కలయజూశాడు. సామాన్లన్నింటిని కుప్పగా పోసి ఇంటికి తాళం వేసిన తర్వాత ఆమె అక్కడ ఇన్నాళ్లు నివసించిందన్న దానికి ఆధారాలే మృగ్యమయ్యాయి.

ఉదయమే కడిగిన ముత్యంలా కాఫీగ్లాసుతో వచ్చి శ్రావ్యంగా పేపరు చదివి విన్పించడం నిజంగా జరిగాయా లేక తన భ్రమా !

ఒక వేళ బ్రతికి మృధుల సజీవమై వస్తే తనను చూస్తుందా ? లేక ఖాళీ జాగాను గమనిస్తుందా!! అనుకుంటూ భారంగా కళ్లు మూసుకున్నాడు వెంకటపతి.